
ఎంవీపీ రైతుబజార్‌లో స్టాల్స్ ఎదుట రైతులు వదిలేసిన చెత్త


సీతమ్మధార రైతు బజార్‌లో ఇరువైపులా స్టాల్స్ మధ్యలో చెత్త

రైతుబజార్లపై చెత్త భారం

- ఉదయం, సాయంత్రం బజార్లలో క్లీనింగ్ భారం
- క్లీనింగ్ సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- పెరుగుతున్న రైతులకు అనుగుణంగా జరగని సిబ్బంది నియామకం
- శుభ్రతపై రైతులకు అవగాహన పెంచడంలో అధికారులు విఫలం

ఎంవీపీ కాలనీ : స్వచ్ఛతకు నిదర్శనంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ భావిస్తున్న నగరంలోని రైతు బజార్లపై చెత్త భారం ఎక్కువవుతోంది. పెరుగుతున్న వినియోగదారుల అవసరాలు, రైతుల సంఖ్యకు అనుగుణంగా నగరంలోని రైతు బజార్లలో పారిశుధ్య సిబ్బందిని నియమించకపోవడమే ఇందుకు కారణం. దశాబ్దాలుగా నగరంలో అనేక రైతు బజార్లు వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం బజార్లుగా విభజించి ఇక్కడ రైతులకు కేటాయింపులు చేస్తున్నారు. దీంతో ఆయా సమయాల్లో వినియోగదారులకు తాజా కూరగాయలను రైతులు అందుబాటులో ఉంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఉదయం, సాయంత్రం బజార్ నిర్వహణకు వీలుగా క్లీనింగ్ పెద్ద సమస్యగా మారుతోంది. విక్రయాల అనంతరం పెద్ద ఎత్తున వ్యర్థాలను వదిలేస్తున్న రైతులు, శుభ్రం చేయాల్సిన సిబ్బంది కొరత కారణంగా క్లీనింగ్‌పై ప్రభావం పడుతోంది. దీంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో రైతు బజార్లలో ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.


రాత్రి పూట ఎంవీపీ రైతు బజార్‌లో పేరుకుపోయిన చెత్త వద్ద చేరిన ఆవులు

సగం బజార్లలో ఇదే పరిస్థితి...

నగరంలో 13 రైతు బజార్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఆరిలోవ, తగరపువలసలో మరో రెండు బజార్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో బజార్ల సంఖ్య 15కు చేరనుంది. అయితే వీటిలో సగం బజార్లను క్లీనింగ్ సిబ్బంది కొరత వెంటాడుతోంది.


ఎంవీపీ రైతు బజార్‌లో మధ్యాహ్నం చెత్త తొలగిస్తున్న కార్మికుడు

క్లీనింగ్ సిబ్బంది ఉదయం రైతుబజార్‌లో విక్రయాలు పూర్తయిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆయా బజార్లను క్లీన్ చేసి సాయంత్రం రైతులకు అందుబాటులోకి తేవాల్సి వుంటుంది. సాయంత్రం బజార్ రాత్రి 8 గంటలకు పూర్తయిన తర్వాత మరలా క్లీన్ చేసి ఉదయం రైతులకు సిద్ధం చెయ్యాల్సి వుంటుంది. దీంతో అరకొర సిబ్బంది కారణంగా క్లీనింగ్ భారంగా మారుతోంది. ఎంవీపీ కాలనీ వంటి పెద్ద బజార్లలో ఇద్దరు క్లీనింగ్ సిబ్బంది సేవలు అందిస్తుండగా ఈ సంఖ్య ఇంకా పెంచాల్సి ఉంది. సీతమ్మధార, పెందుర్తి, అక్కయ్యపాలెం, స్టీల్‌ప్లాంట్... ఇలా చాలా బజార్లలో ఒక్కరే క్లీనింగ్ సిబ్బంది ఉండటం సమస్యగా మారింది. కొన్ని చోట్ల క్లీనింగ్‌కు ఇద్దరు సిబ్బంది ఉండగా చాలా బజార్లలో ఒక్కరే ఉండడంతో వారిపై భారం పడుతోంది. కొన్ని బజార్లలో అయితే మరీ దారుణంగా క్లీనింగ్, వాచ్‌మెన్ బాధ్యతలు సైతం ఒక్కరే నిర్వహిస్తుండటం గమనర్హం. ప్రధానంగా మధ్యాహ్నం బజార్ పూర్తయిన తర్వాత శుభ్రం చేసి సాయంత్రం బజార్ నిర్వహించే రైతులకు అప్పగించడంలో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అధిక మొత్తంలో వ్యర్థాలు వేయకుండా బజార్లను శుభ్రంగా ఉంచేలా రైతులకు అవగాహన పెంచడంతోపాటు క్లీనింగ్ సిబ్బందిని అవసరానికి అనుగుణంగా పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఆక్రమణల తొలగింపు


రామకృష్ణాపురంలో ఆక్రమణకు గురైన ఖాళీ స్థలంలో కంచె తొలగిస్తున్న పొక్లెయిన్

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఆక్రమణలను టౌన్ ప్లానింగ్, రూరల్ మండల రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో చుట్టూ కంచె ఏర్పాటు చేయడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులతో అధికారులు పరిశీలించారు. గురువారం ఆ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థలం చుట్టూ ఉన్న కంచెతోపాటు దానికి సమీపంలో పశువుల కోసం నిల్వ చేసిన గడ్డి **కుప్పను తొ**లగించారు. అంతవరకు బాగానే ఉంది **కానీ... ఆ** స్థలం పక్కనే ఓ వ్యక్తి ఇటీవల జీవీఎంసీ **స్థలం ఆక్ర**మించి షెడ్ నిర్మించారు. సుమారు 60 **చదరపు** గజాల స్థలంలో నిర్మించిన ఆ షెడ్ వైపు **అధికారులు** కన్నెత్తి చూడకపోవడం విశేషం. స్థానిక **ఎమ్మెల్యే** వెలగపూడి రామకృష్ణబాబు సహకారంతో **ఆ వ్యక్తి స్థ**లం ఆక్రమించి షెడ్ నిర్మించుకోవడంతో అధికారులు దాని జోలికి వెళ్లడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైల్వే జోన్ నిర్మాణం పనులు జరుగుతున్న సమీపంలో ఆక్రమణలు, పశువుల పాకలు, గడ్డి కుప్పలు ఉండకూడదంటున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, రూరల్ రెవెన్యూ అధికారులకు అక్కడే ఆక్రమణ స్థలంలో షెడ్ నిర్మాణం కనిపించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి


ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎమ్మెల్సీ చిరంజీవి, తదితరులు


హోలిస్టిక్ రిపోర్ట్ కార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


విద్యార్థులు, తల్లిదండ్రులతో కార్పొరేటర్, తదితరులు

మద్దిలపాలెం : మెగా పేరెంట్స్ సమావేశాన్ని మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలతో విద్యలో రాణించాలన్నారు. ప్రైవేట్ కళాశాల కంటే నిష్ణాతులైన అధ్యాపక బృందం ప్రభుత్వ కళాశాలలో ఉన్నారన్నారు. వారి బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ, ప్రిన్సిపాల్ బి.సుజాత, లయన్స్‌క్లబ్ ట్రస్టీ దుర్గాప్రసాద్, అధ్యాపకులు వేదవ్యాస్, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంలోని మత్స్యకార పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పురోగతికి అవసరమైన సూచనలు, సలహాలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీసుకున్నారు. పాఠశాల చైర్మన్ పేర్ల భాస్కరరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో హోలిస్టిక్ రిపోర్ట్ కార్డులు అందజేశారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 18వ వార్డు పరిధి సెక్టార్ – 9లోని జీవీఎంసీ స్కూల్‌లో ఆత్మీయ సమావేశం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి, వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కలిసి పని చేయాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ గొలగాని మంగవేణి, హెచ్‌ఎం రవిసిద్ధార్థ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివాజీపాలెంలో అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు గోవింద్, సభ్యులు

మద్దిలపాలెం : గురు పౌర్ణమి సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం సాయిబాబా గుడి వద్ద శ్రీక్రిష్టా సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ సంఘం ప్రతినిధులతో కలిసి భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దువ్వి నాగరాజు, నొడగల ప్రకాష్, ఓ.రమేష్, శ్యామ్, శ్రీను, సారిపల్లి రమణ, ఓ.శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు బోటు ఇంజిన్ల పంపిణీ

ఎంవీపీ కాలనీ : జాతీయ మత్స్యరైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకారులకు బోటు ఇంజిన్లు పంపిణీ చేశారు. 19వ వార్డు పెదజాలరిపేటలో ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అతిథిగా పాల్గొని అర్హులైన మత్స్యకారులకు ఇంజిన్లు పంపిణీ చేశారు. పెద జాలరిపేటలో రూ.55 లక్షలు విలువ చేసే ఇంజిన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా ఈ బోటు ఇంజిన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారులకు సబ్సిడీపై మరిన్ని వేట వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. పలువురు ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం


రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గంతో గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం సీతమ్మధారలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్, కార్యదర్శిగా పీబీఎస్ఎన్ రెడ్డి, కోశాధికారిగా ప్రశాంతి, ఉపాధ్యక్షులుగా షీలా, క్లబ్ డైరెక్టర్లుగా వై.వి.వి.సత్యనారాయణ, మిరియాల వేణుగోపాల్, రామ్ పలిశెట్టి, శ్రీనివాస్ రెడ్డి, హరిత, షరిమల, నాగిరెడ్డి, కృష్ణయ్య తదితరులు రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో హనుమంతవాక జంక్షన్‌లో మెట్రో గ్రీన్ పేరిట పెంచుతున్న మొక్కలు, గోపాలపట్నంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్ పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతుబజార్‌లో తనిఖీలు


రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రీనివాస్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజార్‌లో గురువారం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పచ్చిమిర్చి, టమాట, ఉల్లిపాయల కొంటర్లను, రైతు గుర్తింపు కార్డులను, వ్యాపార దుకాణాలను పరిశీలించారు. అన్ని రకాల కూరగాయలు రైతుబజార్లలో అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, లేనిపక్షంలో తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఉల్లిపాయలు, బంగాళ దుంపలు, టమాటాలు వంటివి నాణ్యమైన సరకులు మాత్రమే తెప్పించుకోవాలన్నారు. రైతుబజార్‌లో కొత్తగా జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. డీసీఎంఎస్ కౌంటర్ మేనేజర్‌తో వారు అద్దె బకాయిలు ఉండటం వల్ల త్వరగా చెల్లించాలని, లేకపోతే కౌంటర్‌ను రద్దు చేస్తామని ఫోన్‌లో మాట్లాడారు. వినియోగదారులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై రైతుబజారు ఈవో నాగేశ్వరరావును అడిగి తెలుసుకుని, సంతప్తి వ్యక్తం చేశారు.

అప్పన్న సన్నిధిలో కలెక్టర్ దంపతులు


కప్పస్తంభం వద్ద కలెక్టర్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట స్వామికి అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రంలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

భక్తితో గురు పౌర్ణమి పూజలు


విశాలాక్షినగర్‌లో అభిషేక సమయంలో షిర్డీ సాయిబాబా


పాతవెంకోజీపాలెంలో ప్రత్యేక అలంకరణలో..


సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, మువ్వల సురేష్


ప్రత్యేక అలంకరణలో సత్యసాయిబాబా, దేవతామూర్తులు


శివాజీపాలెం మందిరంలో...


కొత్త వెంకోజీపాలెంలో చందనాభిషేకం

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో గురువారం షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులు స్వామికి అన్నాభిషేకం, క్షీర, జలాభిషేకం చేశారు. తొమ్మిదో వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీలో షిర్డీ సంస్థాన్ ఆలయం, విశాలాక్షినగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయం, పదో వార్డులోని ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయం, పన్నెండో వార్డులో చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామికి అన్నాభిషేకం చేపట్టి అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు కాగడా హారతి, పుష్పాలంకరణ, మధ్యాహ్న హారతి, అన్నాభిషేకంతో ముగిశాయి.

శ్రీ సత్యసాయి ప్రేమసదన్‌లో...

ఎంవీపీ కాలనీ : శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లువారుజామున 4.40 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన అత్యంత వేడుకగా జరిగాయి. ప్రేమ సదన్‌లో కొలువైన శ్రీసాయీశ్వర స్ఫటిక లింగానికి, శ్రీ చక్రమేరుపు స్వరూప శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి క్షీరాభిషేకం, అష్టోత్తర కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి సహస్ర నామ పుష్పార్చన, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం నిస్సహాయులకు నారాయణ సేవ, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

టీచ్‌రోడ్డు : గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయాలు కిటకిటలాడాయి. ఈస్ట్ పాయింట్ కాలనీలోని సాయిబాబా ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

- గురు పౌర్ణమి సందర్భంగా 28వ వార్డులోని సాయి సదన్‌లో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు హాజరై భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సుమారు 8 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు..

మద్దిలపాలెం : శివాజీపాలెంలో గల సాయిబాబా మందిరంలో సాయినాథునికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పాతవెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సాయినాథునికి పంచామృతాభిషేకం, విభూది, చందనాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం అర్చకులు రంపా రామ్మోహన్ శర్మ, రంపా మురళి శర్మ కలిసి ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులచే అన్నాభిషేకం నిర్వహించి ఆ అన్నంతో మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం సాయినాథుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు.

- యల్లమాంబనగర్ కాలనీ, హెచ్‌బీ కాలనీ శివాలయం సముదాయంలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా చేపట్టారు. అర్చకులు సంతోష్ శర్మ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.


సాయినాథునికి సమర్పించిన స్వీట్లు

- కొత్త వెంకోజీపాలెంలోని సాయిబాబా ఆలయంలో గ్రామ సేవా సంఘం, శ్రీ సద్గురు సాయినాథ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రభాకర్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి తెల్లవారుజాము నుంచి సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అన్నంతో అన్నాభిషేకం చేసి అనంతరం ప్రసాదంగా పంచి పెట్టారు. గ్రామస్థులంతా వివిధ రకాల మిఠాయిలు, తినుబండారాలను ప్రసాదంగా ఉంచి, సాయంత్రం అందరికీ పంచిపెట్టారు.

సాయినాథునికి అన్నాభిషేకం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ పార్వతీముక్తేశ్వర ఆలయంలో కొలువైన శ్రీ సద్గురు సాయినాథునికి అన్నాభిషేకం నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో కాగడ హారతి, పాలాభిషేకాలు చేశారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు.


అన్నాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు


అన్నదానం చేస్తున్న పల్లా దుర్గారావు


చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ



స్మార్ట్ మీటర్లు వద్దంటూ నినదిస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై నెలవారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గనాయుడు ఆరోపించారు.

స్మార్ట్ మీటర్ల సమస్యపై సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 59వ వార్డు నెహ్రూనగర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం, ఆపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గనాయుడు మాట్లాడుతూ, చంద్రబాబుది ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత మరో మాట అని విమర్శించారు. గత ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు ఒక్క పైసా కూడా పెంచబోమని హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వేలకు వేలు వసూలు చేస్తూ ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలో ఇప్పటికే పలు వాణిజ్య దుకాణాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారని, దీనివల్ల వ్యాపారులు వేలకు వేలు చార్జీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే, వారిని తిరిగి పంపాలని జగ్గనాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం


మధ్యవర్తిత్వ విధానంపై కరపత్రం అందిస్తున్న మేజిస్ట్రేట్ స్వాతి భవాని

భీమునిపట్నం: కోర్టుల్లోని పలు కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానం ఎంతో ఉపయోగపడుతుందని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని అన్నారు. దీనిగురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. మధ్యవర్తిత్వ ప్రజా అవగాహనపై వారం రోజులు జరిగే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. గుర్తింపు, శిక్షణ పొందిన మధ్యవర్తులు ఉంటారని, వారు ఆయా కేసుల గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.